సాక్షి జగిత్యాల

బుధవారం । 29 । నవంబర్ । 2023



కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్నస్వామి వారిని మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. 2లో▸



అందని అభయహస్తం

అభయహస్తం డబ్బులు అందక మహిళా సంఘాల సభ్యులు ఎదురుచూస్తున్నారు. 23 నెలల క్రితం వివరాలు సేకరించారు. 2లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/20.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కనిపిస్తుంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

నృసింహుడికి వెండి వస్తువులు బహూకరణ



బహూకరిస్తున్న వెండి విగ్రహం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీవేంకటేశ్వర స్వాములకు పట్టణానికి చెందిన దామెర రాంసుధాకర్‌రావు, సంఘమిత్ర దంపతులు వెండి వస్తువులను బహూకరించారు. హైదరాబాద్‌లో ఉంటున్న వీరు.. మంగళవారం స్వామివారలను దర్శించుకుని వెండి విగ్రహం, నామాలు, శ్రీవేంకటేశ్వరస్వామికి వెండి పాదాలతో తయారు చేసిన ప్లేట్‌ను అర్చకులకు అందించారు. ఈ ఆభరణాల విలువ సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందని దంపతులు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ

జగిత్యాల: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 78రూట్లలో మొత్తం 785 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 234 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, 992సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారుల నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఇప్పటివరకు 3,348 మంది వినియోగించుకున్నారని, ఎపిక్ కార్డుల న్నీ పంపిణీ చేశామని తెలిపారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో 161 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామని, 15 కంపెనీల కేంద్ర బలగాలతోపాటు, సివిల్ పోలీసు సిబ్బంది మూడు వేల మందిని నియమించామని వివరించారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, నిరంతరం వాహనాలు తనిఖీ చేస్తామన్నారు. ఇప్పటివరకు రూ.2.59 కోట్లు పట్టుకున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ లత పాల్గొన్నారు.

'మోడల్' కేంద్రాలను తీర్చిదిద్దాలి



యూత్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బాలే శివాజీ

మల్లాపూర్: జిల్లాలో ఎంపిక చేసిన మహిళ, యూత్, దివ్యాంగ పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని డీఆర్డీవో ఏపీడీ బాలే శివాజీ అన్నారు. మంగళవారం మండలంలోని ఒబులాపూర్, కొత్తదాంరాజుపల్లి గ్రామాల్లో పర్యటించి కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి నియోజకవర్గంలో నాలుగు కేటగిరీల్లో ఓటర్లను ఆకర్షించేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొదటిసారి ఓటు వినియోగించుకునే వారికి ఓటు ప్రాధాన్యాన్ని తెలిపే వాల్ రైటింగ్ చిత్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్టీల రంగులు, నమూనాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళా పోలింగ్ కేంద్రాలను మామిడి తోరణాలు, పూలతో అలంకరించాలని, ముగ్గులు వేయించాలన్నారు. మహిళా సాధికారత, గృహహింస చట్టాలు, విద్యకు సంబంధించిన పోస్టర్లు, సెల్‌ఫోన్ వాడకంతో నిత్య జీవితంలో కోల్పోతున్న విషయాలను వాల్ పేయింటింగ్‌లు, కోటేషన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కేంద్రంలో పోలింగ్ అధికారులుగా అందరూ మహిళా సిబ్బందినే కేటాయిస్తారన్నారు. మంచినీరు, ఫర్నిచర్, విద్యుత్ సరఫరా, లైట్లు ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలలో కొత్త దాంరాజుపల్లి, ఒబులాపూర్ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గంగపుత్రుల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

మెట్‌పల్లి: గంగపుత్రుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని గంగపుత్ర ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కావూరి వెంకటేశ్ తెలిపారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు గంగపుత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనడంలో వాస్తవం లేదన్నారు. కుల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గంగపుత్రులకు మెరుగైన ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోందన్నారు. అలాగే సంఘ భవనాలకు ప్రత్యేక నిధులు, ఉచితంగా వాహనాలను అందిస్తోందని పేర్కొన్నారు.

ష్..గప్‌చుప్!

ప్రచారం పరిసమాప్తం

జంగ్ తెలంగాణ

- సైలెన్స్ పీరియడ్ మొదలు
- ప్రధాని, సీఎం, రాహుల్ ప్రముఖుల సభలు
- పాతజిల్లాల్లో 50 రోజుల ఎన్నికల ప్రచారం
- సభలు, రోడ్ షోలు, ర్యాలీలతో బలప్రదర్శన
- ఎత్తుకు పైఎత్తులతో హోరెత్తించిన అభ్యర్థులు





నగరంలో మూసివేసిన బార్ అండ్ రెస్టారెంట్

సాక్షిప్రతినిధి,కరీంనగర్/సాక్షి,పెద్దపల్లి: ఎన్నికల పర్వంలో మరో ఘట్టం మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌లో సీఎం కేసీఆర్‌తో మొదలైన సభల సందడి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ జైరాంరమేశ్‌తో ముగిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటే రాజకీయ చైతన్యానికి ప్రతీక. అందుకే, ఈ జిల్లాలో మెజారిటీ సీట్లు సాధించిన వారే రాజధానిలో అధికారంలో ఉంటారన్న నమ్మకం అనాదిగా వస్తోంది. అందుకే, ఈ జిల్లాపై బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రత్యేక దృష్టి సారించి, సర్వశక్తులు ఒడ్డి ప్రచారం చేశాయి.

ప్రముఖుల సభలతో ఊపు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటే కేసీఆర్‌కు ఉద్యమ కాలం నుంచి ప్రత్యేక అభిమానం. అందుకే, ఆయన ఈ జిల్లాలో పలుమార్లు సుడిగాలి పర్యటన చేశారు. హుస్నాబాద్‌తో మొదలు పెట్టిన సీఎం కేసీఆర్ తరువాత విడతల వారీగా అన్ని నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆఖరుగా వేములవాడతో ఉమ్మడి జిల్లా సభలు ముగించారు. అలాగే కేటీఆర్ కూడా 13 నియోజకవర్గాల్లో పర్యటించారు.

- ప్రధాని మోదీ కరీంనగర్‌కు, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా (జమ్మికుంట), యూపీ సీఎం యోగి (వేములవాడ), మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే (ధర్మపురి)లు బీజేపీ తరఫున ప్రచారం నిర్వహించారు.
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంథని, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, వేములవాడలో పర్యటించారు. వీరే కాక రేవంత్‌రెడ్డి, జైరాం రమేశ్, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాగేల్ తదితరులు సభల్లో పాల్గొన్నారు.

50 రోజులు హోరెత్తిన ప్రచారం..

గతనెల 9న ఎన్నికల షెడ్యూల్ విడుదలైన దరిమిలా.. ఎన్నికల సందడి మొదలైంది. అభ్యర్థుల ఖరారు, నామినేషన్లతో జోరందుకున్న ప్రచారంలో మొత్తంగా దాదాపు 50 రోజులుగా అభ్యర్థులు ఒక్కొక్కరు ఒక్కో స్టైల్‌లో దూసుకెళ్లారు. కొందరు అభ్యర్థులు భారీ బహిరంగ సభల ద్వారా బలప్రదర్శన చేయగా, మరికొందరు నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నమ్ముకున్నారు. ప్రజలకు తమ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలతో పాటు, తమదైన హామీలతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవటానికి యత్నించారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు, వారి కుటుంబ సభ్యులు సైతం ప్రచారంలో పాల్గొన్నారు.

సైలెన్స్ పీరియడ్ మొదలు..

ఉమ్మడి జిల్లాల్లో 13 నియోజకవర్గాల్లో ప్రచారం ముగిసింది. మైకులు మూగబోయాయి. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సైలెన్స్ పీరియడ్‌గా ప్రకటించారు. అభ్యంతరకర, రాజకీయపరమైన, బల్క్ ఎస్ఎంఎస్‌ల ప్రసారంపై నిషేధం ఉందని అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రచారం తర్వాత తెర వెనుక పంపిణీలపై ఎన్నికల అధికారులు దృష్టి పెట్టారు. బల్క్ మెసేజ్‌లు, సోషల్ మీడియాలపైనా నిఘా పెట్టారు.

నియోజకవర్గం.. పోలింగ్ స్టేషన్ల వివరాలు..

కరీంనగర్ నియోజకవర్గంలో 390 పోలింగ్ స్టేషన్లు, చొప్పదండిలో 327, మానకొండూరులో 316, హుజూరాబాద్‌లో 305, రామగుండంలో 259, మంథనిలో 288, పెద్దపల్లిలో 290, వేములవాడలో 170, సిరిసిల్లలో 287, కోరుట్లలో 262, జగిత్యాలలో 254, ధర్మపురిలో 269 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.

నియోజక వర్గాలవారీగా ఓటర్ల వివరాలు..

నియోజక వర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు	బరిలో అభ్యర్థులు
కరీంనగర్	1,77,893	1,77,117	44	102	27
చొప్పదండి	1,13,050	1,19,933	07	193	14
మానకొండూరు	1,08,846	1,12,766	01	128	10
హుజూరాబాద్	1,21,809	1,27,743	06	164	22
జగిత్యాల	1,11,720	1,19,728	20	45	15
కోరుట్ల	1,15,027	1,25,824	04	46	15
ధర్మపురి	1,11,172	1,15,702	06	133	15
సిరిసిల్ల	1,19,663	1,24,756	07	106	21
వేములవాడ	1,06,890	1,15,331	30	53	16
పెద్దపల్లి	1,26,046	1,28,212	08	264	17
రామగుండం	1,11,200	1,09,794	25	213	23
మంథని	1,16,707	1,19,716	19	155	21

సంజయ్‌ని ఆశీర్వదించండి



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్, జెడ్పీ చైర్‌పర్సన్

- ప్రజలకు సేవ చేస్తే జీవన్‌రెడ్డి బాండ్‌పేపర్ రాసిచ్చేవారా..?
- కాంగ్రెస్ అంటేనే అబద్ధాల పార్టీ
- బీఆర్ఎస్ గెలిస్తేనే మరింత అభివృద్ధి
- రోడ్‌షోలో ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్

జగిత్యాల: జగిత్యాల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్‌ను గెలిపించుకోవాలని ఎమ్మెల్సీ కవిత ప్రజలను కోరారు. జిల్లాకేంద్రంలోని టవర్‌సర్కిల్ నుంచి నాయుడు చౌరస్తా, అన్నపూర్ణ చౌరస్తా మీదుగా పాతబస్టాండ్ వరకు రోడ్‌షో నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ప్రజలకు సేవ చేసి ఉంటే ఈ ఎన్నికల్లో బాండ్‌పేపర్ రాసిచ్చేవారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటేనే అబద్ధాల పార్టీ అని, జగిత్యాలకు జీవన్‌రెడ్డి చేసిందేమీ లేదని పేర్కొన్నారు. కర్ణాటకలో బాండ్‌పేపర్ రాసిచ్చి ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు ఇక్కడ మోసం చేసేందుకు కుట్ర జరుగుతోందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో జగిత్యాలను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసుకోవడంతోపాటు, మెడికల్ కళాశాల వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసుకున్నామని తెలిపారు. మూడోసారి ఎన్నికల్లో గెలిచి రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, మహిళలందరికీ పెన్షన్, రేషన్‌కార్డులు ఇస్తామని వెల్లడించారు.

రేటెంతరెడ్డి మాటలు నమ్మొద్దు

పీసీసీ అధ్యక్షుడు రేటెంతరెడ్డి మాటలు నమ్మకూడదని, కొత్తకొత్త మాటలు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెడుతున్నాడన్నారు. తులసివనంలో గంజాయి మొక్కలాంటి రేవంత్ అవసరమా..? అని ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. కాంగ్రెస్‌లో కుర్చీల లొల్లి తప్ప మరొకటి ఉండదన్నారు.

అభివృద్ధి చేశా.. అవకాశమివ్వండి: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ఎమ్మెల్సీ కవిత సహకారంతో జగిత్యాలను అభివృద్ధి చేశానని, జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్, డీపీవో భవనం, నర్సింగ్ కళాశాల, మెడికల్ కళాశాల, డయాగ్నోస్టిక్ సెంటర్, రోడ్ల అభివృద్ధి, పల్లెలన్నీ పట్టుకొమ్మలుగా మార్చామన్నారు. ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. జగిత్యాలను రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశానని, మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.

జగిత్యాలలో మెరుగైన అభివృద్ధి: ఎమ్మెల్సీ రమణ

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మకూడదని, గతంలో కంటే జగిత్యాల మెరుగైన అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. పట్టణ ప్రగతితో మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకోగా.. పల్లెప్రగతితో పల్లెలన్నీ అభివృద్ధి సాధించాయని తెలిపారు. రోడ్‌షోకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. బీఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



సభకు హాజరైన ప్రజలు

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట చర్యలు

- ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి
- జిల్లాలో 144 సెక్షన్ అమలు
- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ ఉదయం 7 గంటల వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి స్థానిక పోలీసులతోపాటు, కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు, రూట్ మొబైల్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ టీమ్స్ ఏర్పాటు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేస్తామన్నారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువమంది గుంపులుగుంపులుగా తిరగొద్దని తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, గుర్తులు, ప్లకార్డులు ధరించొద్దని, ప్రదర్శించొద్దని పేర్కొన్నారు. మైకులు, లౌడ్‌స్పీకర్లు వాడరాదని, రాజకీయ పార్టీల పాటలు, ఉపన్యాసాలు ఇవ్వకూడదని పేర్కొన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలపై నిషేధం ఉంటుందన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం వంటివాటికి పాల్పడితే నేరంగా పరిగణిస్తామన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే ఎన్నికల నియమావళి ప్రకారం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఒకటో తేదీ సెలవు ఇవ్వండి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

జగిత్యాల: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి మరుసటి రోజు ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్, భూమేశ్వర్ అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 29, 30 తేదీల్లో ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఓటింగ్ రోజు ప్రక్రియ తర్వాత సిబ్బంది సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇంటికెళ్లే సరికి చాలా సమయం పడుతుందని, మరుసటి రోజు ఉదయం పాఠశాలకు హాజరయ్యేందుకు ఇబ్బందిగా ఉంటుందని, డిసెంబర్ ఒకటిన ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయాలని కోరారు.

కోరుట్లలో ఎగిరేది గులాబీ జెండానే

- ఎంపీ అర్వింద్ భాష మార్చుకుంటే మంచిది
- కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గంలో ఎగిరేది బీఆర్ఎస్ జెండానే అని ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ శాంతియుతంగా ఉన్న కోరుట్లలో కులం, మతం పేరుతో కల్లోలం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చస్తే రూ.10లక్షలు బీమా ఇస్తాననడం, తన తండ్రి విద్యాసాగర్‌రావును ఇష్టమొచ్చినట్టు తిట్టటం బాధ కలిగించిందన్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థులు ఉండాలి కాని ఇంతగా శత్రుత్వం ఉండొద్దని సూచించారు. అభ్యర్థులు ఇప్పటివరకు చేసిన పనులు, గెలిచిన తర్వాత ప్రజలకు ఏం చేస్తామో చెప్పాలిగానీ.. ఏమీ చేయకుండా ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదన్నారు. ఎంపీ అర్వింద్ తన భాష మార్చుకుంటే మంచిదని సూచించారు. కోరుట్ల ఓటర్లు చాలా విజ్ఞతతో ఉన్నారని, ఎవరు సేవకులో వారికి తెలుసన్నారు. 15 ఏళ్లుగా ప్రజలకు ఏదో రకంగా సేవ చేస్తూనే ఉన్నానని గుర్తు చేశారు. స్థానికంగా ఉండే వారెవరో..? నాన్ లోకల్ ఎవరో ప్రజలకు తెలుసన్నారు. సీఎం కేసీఆర్ పథకాలు, తన తండ్రి, ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు నియోజకవర్గ అభివృద్ధికి చేసిన పనులే తనను గెలిపిస్తాయన్నారు. భారీ మెజారిటీతో బీఆర్ఎస్ కోరుట్లలో గెలవబోతోందన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడనుందన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సింగిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాశిరెడ్డి మోహన్ రెడ్డి, కౌన్సిలర్ గుండోజి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లాలో 36 మోడల్ పోలింగ్ కేంద్రాలు - కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాలో మొత్తం 36 మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. మహిళలు, దివ్యాంగులు, యువత కోసం వీటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా కేటగిరీల వారు ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు.

జగిత్యాలలో..

పోలింగ్‌కేంద్రం	మండలం	కేంద్రం నంబరు	కేంద్రం స్థలం
మహిళ పోలింగ్ కేంద్రం	రాయికల్	49	మండల పరిషత్ పాఠశాల, ఉప్పుమడుగు
మహిళ పోలింగ్ కేంద్రం	బీర్‌పూర్	83	ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీర్‌పూర్
మహిళ పోలింగ్ కేంద్రం	సారంగాపూర్	100	ప్రభుత్వ పాఠశాల, పెంబట్ల
మహిళ పోలింగ్ కేంద్రం	జగిత్యాలరూరల్	132	మండల పరిషత్ పాఠశాల, గుట్రాజ్‌పల్లి
మహిళ పోలింగ్ కేంద్రం	జగిత్యాల అర్బన్	164	జిల్లా అటవీశాఖ కార్యాలయం
మోడల్ పోలింగ్ కేంద్రం	బీర్‌పూర్	66	షెడ్యూల్ స్కూల్, కొమురంభీం నిలయం
మోడల్ పోలింగ్ కేంద్రం	జగిత్యాల అర్బన్	213	ఖిలాగడ్డ ఉర్దూమీడియం స్కూల్, జగిత్యాల
మోడల్ పోలింగ్ కేంద్రం	జగిత్యాలరూరల్	127	మండల పరిషత్‌పాఠశాల, సంగంపల్లి
మోడల్ పోలింగ్ కేంద్రం	రాయికల్	48	మండలపరిషత్ పాఠశాల, కుమ్మరిపల్లి
మోడల్ పోలింగ్ కేంద్రం	జగిత్యాల అర్బన్	155	ఎస్‌కెఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల
దివ్యాంగుల పోలింగ్ కేంద్రం	జగిత్యాల అర్బన్	150	గౌతమ్ మోడల్‌స్కూల్, జగిత్యాల
యూత్ పోలింగ్ కేంద్రం	జగిత్యాల అర్బన్	113	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిప్పన్నపేట

కోరుట్లలో..

పోలింగ్‌కేంద్రం	మండలం	కేంద్రం నంబరు	కేంద్రం స్థలం
మహిళ పోలింగ్ కేంద్రం	ఇబ్రహీంపట్నం	3	మండల పరిషత్ పాఠశాల, మూలరాంపూర్
మహిళ పోలింగ్ కేంద్రం	మల్లాపూర్	49	మండల పరిషత్ పాఠశాల, ఒబులాపూర్
మహిళ పోలింగ్ కేంద్రం	కోరుట్ల	148	మున్సిపల్ కార్యాలయం, కోరుట్ల
మహిళ పోలింగ్ కేంద్రం	మెట్‌పల్లి	210	ఎంపీడీవో కార్యాలయం, మెట్‌పల్లి
మహిళ పోలింగ్ కేంద్రం	కోరుట్ల	139	ఈఆర్వో కార్యాలయం, కల్లూరు రోడ్
మోడల్ పోలింగ్ కేంద్రం	మల్లాపూర్	61	మండల పరిషత్ పాఠశాల, గొర్రెపల్లి
మోడల్ పోలింగ్ కేంద్రం	కోరుట్ల	111	ప్రాథమిక పాఠశాల, కల్లూరు
మోడల్ పోలింగ్ కేంద్రం	కోరుట్ల	140	నూతన మున్సిపల్ కార్యాలయం, కోరుట్ల
మోడల్ పోలింగ్ కేంద్రం	మెట్‌పల్లి	212	జాగృతి మండల సమైక్య ఆఫీస్, మెట్‌పల్లి
మోడల్ పోలింగ్ కేంద్రం	మెట్‌పల్లి	253	అంగన్‌వాడీ కేంద్రం, కేసీఆర్ తండా
దివ్యాంగుల పోలింగ్ కేంద్రం	ఇబ్రహీంపట్నం	12	మండల పరిషత్ పాఠశాల, కొండాపూర్
యూత్ పోలింగ్ కేంద్రం	మల్లాపూర్	53	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దాంరాజ్‌పల్లి

ధర్మపురిలో..

పోలింగ్‌కేంద్రం	మండలం	కేంద్రం నంబరు	కేంద్రం స్థలం
మహిళ పోలింగ్ కేంద్రం	ధర్మపురి	23	మండల పరిషత్ పాఠశాల, దోనూరు
మహిళ పోలింగ్ కేంద్రం	బుగ్గారం	57	ప్రాథమిక పాఠశాల, చిన్నాపూర్
మహిళ పోలింగ్ కేంద్రం	ఎండపల్లి	97	ప్రాథమిక పాఠశాల, చెర్లపల్లి
మహిళ పోలింగ్ కేంద్రం	పెగడపల్లి	260	జిల్లా పరిషత్ పాఠశాల, పెగడపల్లి
మహిళ పోలింగ్ కేంద్రం	గొల్లపల్లి	190	మండల పరిషత్ పాఠశాల, దట్నూర్
మోడల్ పోలింగ్ కేంద్రం	ధర్మారం	143	మండల పరిషత్ స్కూల్, నల్లలింగయ్యపల్లి
మోడల్ పోలింగ్ కేంద్రం	వెల్గటూర్	76	మండల పరిషత్ పాఠశాల, జగదేవ్‌పేట
మోడల్ పోలింగ్ కేంద్రం	గొల్లపల్లి	210	మండల పరిషత్ పాఠశాల, రాఘవపట్నం
మోడల్ పోలింగ్ కేంద్రం	ధర్మపురి	45	మండల పరిషత్ పాఠశాల, ఆకసాయిపల్లి
మోడల్ పోలింగ్ కేంద్రం	పెగడపల్లి	253	మండల పరిషత్ పాఠశాల, మద్దులపల్లి
దివ్యాంగుల పోలింగ్ కేంద్రం	ధర్మపురి	31	ప్రభుత్వ పాఠశాల, ధర్మపురి
యూత్ పోలింగ్ కేంద్రం	ధర్మారం	162	మండల పరిషత్ పాఠశాల, చామన్‌పల్లి

క్లుప్తంగా

విధుల్లోకి ఏఆర్ అదనపు ఎస్పీ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ

జగిత్యాలక్రైం: మెడికల్ సెలవులో ఉండి తిరిగి విధుల్లో చేరిన జగిత్యాల జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ అదనపు ఎస్పీ ఆర్.జనార్దన్‌రెడ్డి మంగళవారం విధుల్లో చేరారు. అనంతరం జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

జగిత్యాలక్రైం: మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బి.శేఖర్ నాయక్ అనే కానిస్టేబుల్ తన నివాసానికి దగ్గరలో ఉండే మహిళ ఇంటికి అర్ధరాత్రి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించి భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ చేపట్టిన ఎస్పీ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖ మహిళల రక్షణకు కృషి చేస్తుందన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా 87126 70783 లేదా 100 డయల్‌కు సమాచారం అందించాలన్నారు.

5న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

జగిత్యాలటౌన్: ఉమ్మడి జిల్లాస్థాయి (కరీంనగర్ జోన్) అండర్ 14, 17 ఏళ్ల బాలబాలికలకు డిసెంబర్ 5న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీ రాంనాయక్ మంగళవారం తెలిపారు. అర్హత కలిగిన క్రీడాకారులు పట్టణంలోని గొల్లపల్లి రోడ్డు స్వామి వివేకానంద మినీస్టేడియంలో నిర్వహించే ఎంపిక పోటీలకు 5న ఉదయం 9గంటల్లోపు అవసరమైన జిరాక్స్ ప్రతులతో సంప్రదించాలని కోరారు.

ఓటుహక్కు కోల్పోతున్న కార్యదర్శులు

జగిత్యాలరూరల్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో వందశాతం ఓటుహక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ అన్నిఏర్పాట్లు చేస్తున్నా ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో కొంత మంది పంచాయతీ కార్యదర్శులు ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కోల్పోతున్నారు. రిటర్నింగ్ అధికారిని అడిగితే ఆర్డర్ ఉంటేనే బ్యాలెట్ పేపర్ ఇస్తామని చెబుతుండగా, పంచాయతీ కార్యదర్శులకు మౌఖికంగా మాత్రం పోలింగ్‌స్టేషన్‌లో ఉండాలని ఉన్నతాధికారులు తెలుపుతున్నారు. దీంతో వారు ఓటు ఎలా వేసేదని అధికారులను అడిగితే నిర్లక్ష్యం సమాధానం ఇస్తున్నారు. ఈ విషయంపై కార్యదర్శులు జగిత్యాల ఆర్‌వోను వివరణ కోరగా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఎన్నికల ఆర్డర్ అయినా కనీసం ఇవ్వాలని, తమ ఓటు దూర ప్రదేశాల్లో ఉందని, 317 జీవోతో తాము విధులు ఇక్కడ నిర్వర్తిస్తున్నామని తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల కమిషన్, అ. దికారుల నిర్లక్ష్యంతో తమ ఓటుహక్కు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చల్మెడకు మద్దతుగా నాయకుల ప్రచారం



భూషణరావుపేటలో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ లోక బాపురెడ్డి

కథలాపూర్: వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహరావుకు మద్దతుగా మండలంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్, ఊట్‌పెల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. లక్ష్మీ నరసింహరావును భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

నా కుమారుడిని గెలిపించండి



గోధూర్‌లో ప్రచారం చేస్తున్న సంజయ్ తల్లి సరోజన

ఇబ్రహీంపట్నం: కారు గుర్తుకు ఓటు వేసి కోరుట్ల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించలని కోరుతూ మండలంలోని గోధూర్ గ్రామంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సతీమణి, సంజయ్ తల్లి సరోజన మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సరోజనమ్మకు గ్రామస్తులు పెద్దఎత్తున స్వాగతం పలికి మహిళలు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచ్ సోమ ప్రభాకర్, ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, నాయకులు వెంకటస్వామి, జాజాల జగన్‌రావు, సత్పడి పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం



రోడ్ షోలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

రాయికల్ : నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నా రు. మంగళవారం పట్టణంలో రోడ్‌షో నిర్వహించారు. చివరి శ్వాస వరకు ప్రజల కోసమే పోరాడతానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలను మోసం చేశాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలవగానే పట్టణంలో డిగ్రీ కళాశాల మంజూరు, మున్సిపల్‌లో తైబజార్ రద్దు చేస్తామన్నారు. అల్లీపూర్, ఒడ్డెలింగాపూర్‌ను మండలాలుగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రాయికల్‌కు ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే బోర్నపల్లి బ్రిడ్జి మంజూరు చేశారని గుర్తుచేశారు. మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. మాజీ జెడ్పీటీసీ గోపి మాధవి, పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్ పాల్గొన్నారు.

అవకాశమివ్వండి.. మరింత అభివృద్ధి

- కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దు
- జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్



కుమ్మరిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



బోర్నపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ఐదేళ్లపాటు అభివృద్ధి చేశా, మరోసారి అవకాశమిస్తే మీ అందరికీ సేవ చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని రామాజీపేట, ఒడ్డెలింగాపూర్, చింతలూరు, బోర్నపల్లి, కుమ్మరిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని పేర్కొన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత రైతుల భూములు సస్యశ్యామలమయ్యాయన్నారు. 24 గంటలపాటు కరెంట్, రైతుబంధు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ప్రతి బీడీ కార్మికురాలికి ఎలాంటి ఆంక్షలు లేకుండా పింఛన్ మంజూరు చేస్తామన్నారు. మేఫెస్టోలో ప్రకటించినట్లుగా రూ.400 సిలిండర్, రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల కేసీఆర్ బీమా, అన్నపూర్ణ పథకం కింద ప్రతిఒక్కరికీ రూ.10 లక్షలు అందిస్తామన్నారు. కారు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, ఏఎంసీ చైర్‌పర్సన్ రాణి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచులు బెజ్జంకి రమాదేవి, రవి, లత, శ్రీనివాస్, చింతలపల్లి స్వప్న; ఎంపీటీసీ దొంతి నాగరాజు, కవిత పాల్గొన్నారు.

రెండు మండలాల్లో బీఆర్ఎస్ ప్రచారం

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరిస్తూ, రానున్న రోజుల్లో అమలు చేసే సంక్షేమ పథకాలను తెలుపుతూ డాక్టర్ సంజయ్‌కుమార్‌కు ఓటు వేయాలని కోరారు. కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి తదితరులు, ప్రచారంలో పాల్గొన్నారు.

ఓటు ఎవరికో ?

- ముగిసిన ఎన్నికల ప్రచారం
- తెలియని ఓటరు నాడి
- నలుగురు కలిసినచోట ఇదే చర్చ
- అభ్యర్థుల్లో మొదలైన ఆందోళన

పెగడపల్లి: ఎన్నికల సమయం దగ్గర పడింది. అభ్యర్థుల ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు వారివారి ప్రచారాన్ని హోరెత్తించారు. కానీ ఓటరు గుట్టును మాత్రం తెలుసుకోలేకపోతున్నారు. తానే గెలుస్తానని చెప్పడమే తప్ప లోపల ఏదో తెలియని భయం అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ విషయంపై నలుగురు వ్యక్తులు కలిసినా గ్రామాల్లో సైలెంటు ఓటుపైనే చర్చించుకోవడం కనిపిస్తోంది. అభ్యర్థులు తమ మద్దతుదారులతో గ్రామాల్లో జోరుగా ప్రచారం చేసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడిగితే నీకే వేస్తామంటూ పైకి చెబుతూ రాత్రికి మందు, విందులు చేసుకుంటున్నారు. కానీ అసలు ఓటు ఎవరికి వేస్తారో అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. సైలెంటు ఓటు ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో దాని నాడి తెలుసుకోవడం కోసం అభ్యర్థుల మద్దతుదారులు, ద్వితీయశ్రేణి నాయకులు ఓటర్ల ఇంట్లో గంటల తరబడి మంతనాలు జరుపుతున్నారు. వారిని తమవైపు తిప్పుకోవడం కోసం తంటాలు పడుతున్నారు. పార్టీలతో సంబంధం లేని వారు ఓటెవరికి వేస్తావంటే పెదవి విప్పడం లేదు. అమలవుతున్న సంక్షేమ పథకాలు, కొత్తగా అమలు కానున్న పథకాల గురించి, పార్టీలు ఇస్తున్న హామీలపై చర్చించుకుంటున్నారు. ఏదైమైనా పార్టీలపరంగా వచ్చే ఓట్లకంటే తటస్థంగా ఉండే ఓటు ఎటు మల్లుతుందోననే భయంతో అభ్యర్థులకు తలనొప్పిగా మారిందని భావిస్తున్నారు.

పోటీపోటీగా అభ్యర్థుల ప్రచారం



జగిత్యాలలో రోడ్‌షో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



కాంగ్రెస్ నాయకుల రోడ్‌షో



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

- ముగిసిన అభ్యర్థుల ప్రచారం
- చివరిరోజు ముమ్మరంగా జనంలోకి..
- పోటాపోటీగా ర్యాలీలు, రోడ్‌షోలు
- ప్రలోభాలకు సర్వంసిద్ధం

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళవారం సాయంత్రం ఐదు గంటల వరకు అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచే తమ ప్రచారాన్ని ప్రారంభించినా.. నామినేషన్లు వేసిన అనంతరం నుంచి హోరెత్తించారు. మైకులు, డీజేలతో నెలరోజులుగా ఉర్రూతలూగించారు. చివరిరోజు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ర్యాలీలు నిర్వహించారు. రోడ్‌షోలు చేపట్టారు. కొందరు బైక్ ర్యాలీ చేపట్టారు. జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున రోడ్‌షో నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రచారాన్ని హోరెత్తించారు. సాయంత్రం ఐదు గంటలు కాగానే మైకులన్నీ మూగబోయాయి.

ప్రలోభాల పర్వం

ప్రచారానికి తెరపడటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ ప్రలోభాల వైపు దృష్టి సారించారు. నగదు, డబ్బు అందరికీ చేరేలా నమ్మకమైన నాయకులు, కార్యకర్తలను నియమించుకున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరికి అందేలా లెక్కలు కట్టి పంపిణీ చేసేలా వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. గతంలో డబ్బులు ఎవరు ఎక్కువిస్తే వారి వైపు మొగ్గు చూపే అవకాశం ఉండేది. ఇప్పుడు డబ్బులు తీసుకుంటున్నా.. ప్రజల మనసులో ఉన్నవారికే ఓటు వేసే అవకాశం కనిపిస్తోంది. ఓటర్లు మాత్రం తమ కుటుంబ సభ్యులను బట్టి ఆయా పార్టీలు ఎంత డబ్బులు పంపిణీ చేస్తాయోనని అంచనా వేసుకుంటున్నారు.



బైక్ ర్యాలీ తీస్తున్న బీజేపీ కార్యకర్తలు



ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హోరాహోరీగా ర్యాలీలు

ఇబ్రహీంపట్నం: ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు చివరిరోజు మంగళవారం హోరహోరీగా ప్రచారాలు, ర్యాలీలు నిర్వహించారు. మండలకేంద్రంలో బీజేపి కార్యకర్తలు సుమారు వంద ద్విచక్రవాహనాలపై మండలంలోని అన్నిగ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వాడ వాడనా తిరుగుతూ కారుగుర్తుకు ఓటేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.





కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్నస్వామి వారిని మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఈవో వేంకటేశ్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, శ్రీనివాసశర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరాజం, సంపత్ పర్యవేక్షించారు.

ఓడిపోతే బతకనివ్వరు..

- జగిత్యాల బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి



సమావేశంలో మాట్లాడుతున్న భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: 'ఎన్నికల్లో ఓడిపోతే నన్ను బతకనివ్వరు.. ఆడబిడ్డగా మీ ఇంటి తలుపు తట్టి ఒడిపట్టి అడుగుతున్న.. ఒడిబియ్యం రూపంలో ఓట్లేసి గెలిపించండి.. ఆడబిడ్డను సాదుకున్నా సంపుకున్నా మీరే దిక్కు..' అని బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి ఓటర్లను కోరారు. మంగళవారం విలేకరుల సమావేశంలో బావోద్వేగానికి గురయ్యారు. ఆడబిడ్డను దీవించి ఒక్కసారి అవకాశం ఇవ్వాలన్నారు. నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, మ్యాదరి అశోక్, జున్ను రాజేందర్, నలువాల తిరుపతి, ఎమ్మార్పీఎస్ నాయకులు దుమాల గంగారాం తదితరులు ఉన్నారు.

మద్యం పట్టివేత



సీజ్‌చేసిన మద్యం బాటిళ్లతో ఎస్సై

రాయికల్: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న పట్టణానికి చెందిన కట్కం గంగారాజంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. గంగారాజం ఎన్నికల నిబంధనలు ఉల్లఘంచి మద్యం విక్రయిస్తున్నాడు. ఎస్సై తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా 30లీటర్ల మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిల్లలు లేరని వ్యక్తి ఆత్మహత్య

కోనరావుపేట(వేములవాడ): వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం కలగడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలంలోని కొండాపూర్‌కు చెందిన బెదిరె చిన్న దేవయ్య(50)–భీరవ్వ దంపతులకు సంతానం కలగలేదు. ఈ విషయమై, ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవయ్య మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపానికి గురై, మంగళవారం ఉదయం స్థానిక పెద్దమ్మ ఆలయ సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఏఎస్ఐ రఘుపతిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌కు జైలు

కోనరావుపేట(వేములవాడ): ఆటోను నిర్లక్ష్యంగా నడిపి, బావిలో పడగొట్టి, ఓ వ్యక్తి మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌కు ఏడాదిన్నర జైలుశిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ తీర్పు నిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. 2015 సెప్టెంబర్ 2న సిరిసిల్ల నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటో కోనరావుపేట మండలం మర్తనపేట శివారులోని కలకోట దేవయ్య ఇంటి పక్కనున్న పాడుబడ్డ బావిలో పడింది. ఈ ప్రమాదంలో మర్తనపేట, ధర్మారం, మల్కపేట గ్రామాలకు చెందిన పలువురు ప్రయాణికులు గాయపడగా ధర్మారం వాసి పిట్టల రామస్వామి మృతి చెందాడు. అప్పటి సర్పంచ్ జవ్వాజి తిరుపతిగౌడ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మాలకొండ రాయుడు కేసు నమోదు చేశారు. కానిస్టేబల్ మోహన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ఆటోడ్రైవర్ తీపిరి మహేందర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపి, ప్రమాదానికి కారణమైనట్లు రుజువైంది. దీంతో అతనికి జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ జడ్జి మంగళవారం తీర్పు వెల్లడించారు. ఎవరైనా వాహనాలను అజాగ్రత్తగా నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు.

అభయహస్తం కోసం ఎదురుచూపులు

- 23 నెలల క్రితమే లబ్ధిదారుల ఖాతాల సేకరణ పూర్తి
- నేటికీ ఖాతాల్లో జమకాని డబ్బులు
- జిల్లాలో 90,503 మంది



సమావేశమైన మహిళా సంఘ సభ్యులు(ఫైల్)

జగిత్యాలరూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నపుడు అభయహస్తం పథకంలో చేరిన మహిళా సంఘ సభ్యులకు రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత అభయహస్తం డబ్బులు వాపస్ ఇస్తామని హామీ ఇవ్వడంతో పాటు వారి ఖాతాల వివరాలు 23 నెలల క్రితమే సేకరించారు. కానీ ఇప్పటివరకు అభయహస్తం డబ్బులు మహిళా సంఘాల ఖాతాల్లో పడలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వశక్తి సంఘ మహిళలను ఆర్థికాభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 2009లో అభయహస్తం పథకం ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద కంట్రిబ్యూషన్ నెలనెలా నాలుగు సంవత్సరాల పాటు డబ్బులు చెల్లించగా, ఆ పథకాన్ని 2013లో రద్దు చేశారు. జిల్లాలోని 90,503 మంది మహిళా స్వశక్తి సంఘ సభ్యులు అభయహస్తం పథకంలో చేరారు.

18 నుంచి 59 సంవత్సరాల వారు..

అప్పటి ప్రభుత్వం 2009 నవంబర్ నెలలో మహిళా స్వశక్తి సంఘంలో ఉన్న సభ్యులు 18 నుంచి 59 సంవత్సరాలున్న వారు సంవత్సరానికి రూ.365 చెల్లిస్తే ప్రభుత్వం కూడా కంట్రిబ్యూషన్ కింద రూ.365 చెల్లించింది. నాలుగు సంవత్సరాల పాటు అభయహస్తం పథకం కింద చెల్లించారు. అభయహస్తం పథకం ప్రారంభంలో 60 సంవత్సరాలు నిండిన మహిళా స్వశక్తి సంఘ సభ్యులకు పథకం కింద నెలనెలా రూ.500 పింఛన్ కూడా అందజేశారు. కానీ ప్రభుత్వం మారిన తర్వాత ఆసరా పింఛన్ రూ.1,016కు పెంచడంతో ఈ పథకం మరుగునపడింది. ఈ నేపథ్యంలో అభయహస్తం పథకంలో డిపాజిట్ చేసిన డబ్బులు తమకు వాపస్ ఇవ్వాలని మహిళా స్వశక్తి సంఘాల సభ్యులు మొర పెట్టుకోవడంతో.. ప్రభుత్వం ఎట్టకేలకు వాపస్ ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ మేరకు 23 నెలల క్రితం జిల్లాలో అభయహస్తం లబ్ధిదారుల ఖాతాలను ఐకేపీ సిబ్బంది సేకరించి ప్రభుత్వానికి అందించారు. అయినా ఇప్పటికీ డబ్బులు ఖాతాల్లో పడలేదు.

అసెంబ్లీ సాక్షిగా..

రాష్ట్రంలో అభయహస్తం పథకం కింద కంట్రిబ్యూషన్ డిపాజిట్లు చెల్లించిన ప్రతి సభ్యురాలికి డిపాజిట్లు వాపస్ చెల్లిస్తామని అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించింది. జిల్లావ్యాప్తంగా మహిళా స్వశక్తి సంఘంలో ఉండి అభయహస్తం పథకం కింద డబ్బులు డిపాజిట్ చేసిన సంఘ సభ్యుల వివరాలతో పాటు బ్యాంక్ ఖాతాలను ప్రభుత్వం సమర్పించాలని సూచించడంతో అధికార యంత్రాంగం సభ్యుల వివరాలను సేకరించింది.

ఖాతాల్లోనే జమ చేస్తుంది



జిల్లాలో 2009లో అభయహస్తం పథకంలో జిల్లా నుంచి 90,503 మంది చేరారు. వారికి కంట్రిబ్యూషన్ డిపాజిట్లు వాపస్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో.. ప్రతి సభ్యురాలు, వారి బ్యాంక్ ఖాతా వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. త్వరలోనే ప్రభుత్వం డబ్బులను నేరుగా ఖాతాల్లో జమ చేస్తుంది.

– నరేశ్, డీఆర్డీఏ పీడీ